జలదిగ్బంధంలో గ్రామాలు

- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు
- ఇళ్ల చుట్టూ వరదనీరు


శ్మశానవాటిక వద్ద కొట్టుకుపోయిన రోడ్డు


బేల: కొగ్దూర్‌లో నీటిమునిగిన పంట పొలాలు

బేల: మండలంలోని మాంగ్రుడ్ గ్రామంతో పాటు సాంగిడిరింగ్ రోడ్డు మార్గంలోని మణియార్‌పూర్, గూడ, కాంఘర్‌పూర్, బెదోడ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు బహ్యప్రపంచానికి దూరంగా ఉన్నారు. అలాగే కొగ్దూర్, దహెగాం, సాంగిడి, కొత్త సాంగిడి, నారయణ్‌పూర్, అవాల్‌పూర్ గ్రామాల్లో దాదాపు 2 వేల ఎకరాల వరకు పంటలు పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో మునిగిపోయినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

దెబ్బతిన్న శ్మశానవాటిక

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం శ్మశానవాటిక వరద ప్రవాహానికి పూర్తిగా దెబ్బతింది. పెన్‌గంగ నదిఒడ్డున ఉండడంతో రోడ్డు మొత్తం కొట్టుకుపోయి రాళ్లు తేలాయి. దహన సంస్కారాలు నిర్వహించే గద్దెలకు చెత్తచెదారం తట్టుకుంది. చెట్టుకొమ్మలు, కర్రలను గ్రామస్తులు తొలగించి బాగు చేసుకున్నారు.

నీటమునిగిన పంటలు

తాంసి: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆదివారం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగ ఉగ్రరూపం దాల్చింది. పరీవాహక ప్రాంతాల్లోకి భారీగా వరద రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. భీంపూర్ మండలంలోని గుబిడి, గోముత్రి, అంతర్గాం, అర్లి(టి), వడూర్, తాంసి(కె) గ్రామాల శివారులో పంటలు నీట మునిగాయి. గుబిడి గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. సాగు చేసిన పంటలు పెన్‌గంగ వరద ప్రవాహానికి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


తాంసి: పంటచేల్లో నిలిచిన వరదనీరు

ముంపులోనే దుబార్‌పేట్

ఇచ్చోడ: మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో ఉన్న దుబార్‌పేట్ గ్రామానికి జాతీయ రహదారి ఫ్లైఓవర్ వంతెన శాపంగా మారింది. భారీ వర్షం కురిసిందంటే చాలు గ్రామాన్ని వరద చుట్టుముడుతోంది. ప్రతీ ఏటా వర్షాకాలం వచ్చిందంటే వరద ఇళ్లలోకి వచ్చి చేరుతుంది. నిత్యావసర సరుకులు, సామగ్రి తడిసి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దుబార్‌పేట్ ఆరేళ్లుగా ముంపునకు గురవుతూనే ఉంది. మొదటి సారిగా 2018లో కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో గ్రామస్తులకు 20 రోజుల పాటు మార్కెట్‌యార్డులోని విశ్రాంతి భవనంలో పునరావసం కల్పించారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు వరద నీటితో ముంపునకు గురవుతూనే ఉంది.


నీటమునిగిన దుబార్‌పేట్

పరిష్కారం కాని సమస్య..

ఆరేళ్లుగా గ్రామస్తులు శాశ్వత పరిష్కరం కోసం ఎదురుచూస్తున్నారు. వరదకు గురైన ప్రతిసారి ఆందోళన చేస్తూ.. అధికారులకు విన్నవిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏకంగా నాలుగు గంటల పాటు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గతంలో కలెక్టర్, నేషనల్ హైవే అధికారులు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నా.. అచరణలో అమలు చేయడం లేదు. వరద నీరు వచ్చినప్పుడు అధికారుల హడవీడి చేస్తున్నారు తప్పా.. సమస్యకు పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

‘నిందితులను ఉరితీయాలి’

బేల: మణిపూర్ నిందితులను వెంటనే ఉరితీయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఆడ శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఈఘటనపై ఇప్పటికీ అధికారికంగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరంగే జంగ్‌షా, ఎంపీటీసీ మడావి సకరాం, ఆడ సంతోశ్, మడావి చంద్రకాంత్, సిడాం నందకుమార్, గోద్రు పటేల్, ఫక్రు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మణిపూర్ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివారం ఉట్నూర్ చర్చిల ఆధ్వర్యంలో సీఎస్ఐ చర్చి నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మహిళలను నగ్నంగా ఊరేగించి, హత్య చేయడం దారుణమన్నారు. నిందితులకు ఉరిశిక్ష వేయాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘ నాయకులు డేనియల్, బికుమార్ పాస్టర్, జోసెఫ్ పాస్టర్, రత్నం సామ్యూల్, సునీల్, బిరుదుల లాజర్, దేవానందం, హిమదర్, ప్రవీన్, లింగారావు పాలొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మణిపూర్ ఘటన దేశానికే మాయని మచ్చఅని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర అశోక్ అన్నారు. మణిపూర్ సంఘటనను నిరసిస్తూ.. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ గ్రామంలో నిరసన తెలిపారు. ఆదివాసీ మహిళలపై జరిగిన దారుణ అఘాయిత్యాన్ని, లైంగిక దాడిని ఖండిస్తున్నామన్నారు. నిందితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, రాంకుమార్, విజయ్, శ్రీకాంత్, సానేరావ్, సాయిరాం, గంభీర్, రవి, కార్తీక్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

సిరికొండ: భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ ఖానాపూర్ నాయకులు వెడ్మ భోజ్జు, వినోద్‌నాయక్ కోరారు. ఆదివారం సిరికొండ మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. చిక్‌మాన్ వాగుపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో కమీషన్లు రాకపోవడంతో జాప్యం జరుగుతుందన్నారు. అలాగే ఇంద్రవెల్లి మండలంలోని లాల్‌టెక్డి, హీరాపూర్‌లో కొట్టుకుపోయిన వంతెనలు, రోడ్లను పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి


మౌనం పాటిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఆదిలాబాద్‌టౌన్: అమరుల త్యాగాలు చిరస్మరణీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన టీపీఏస్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ ఉద్యమకారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ క్రియాశీల పాత్ర, అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ సేవలను కొనియాడారు. ముందుగా అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. నాయకులు రాములు నాయక్, అద్దంకి దయాకర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, చెరుకు సుధాకర్ పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

బేల: పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో నష్టపోయిన రైతులకు ఆందోళన చెందవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అన్నారు. ఆదివారం మండలంలోని కొగ్దూర్, మాంగ్రుడ్, దహెగాం, మణియార్‌పూర్ గ్రామాల్లో పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెన్‌గంగ బ్యాక్‌వాటర్‌తో జరిగిన పంట నష్టాన్ని ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మహేందర్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు తన్వీర్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్‌పవార్, వరాడే విఠల్ పాల్గొన్నారు.

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ఇచ్చోడ: దుబార్‌పేట్ గ్రామ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం దుబార్‌పేట గ్రామంలో పర్యటించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి దుబార్‌పేట్ గ్రామాన్ని వరదనీరు ముంచెత్తడం బాధకరమన్నారు. మంత్రి కేటీఆర్‌ను కలిసి వివరిస్తానని పేర్కొన్నారు. ఆయన వెంట ఇచ్చోడ, గుడిహత్నూర్ సర్పంచులు సంఘం అధ్యక్షుడు తిరుమల్‌గౌడ్, పాండు, మాన్నూర్ పీఏసీఎస్ చైర్మన్ ముండే వెంకట్‌రావు, సర్పంచ్ రవి, నర్వాడే రమేశ్, సాబీర్ పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న రావుత్ మనోహర్

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది


సిరికొండ: నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండపూర్ సమీపంలో వరదకు కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. అలాగే దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ఇంద్రవెల్లి: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పలు కాలనీలను సందర్శించారు. కల్వర్టు వద్ద చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం లోపించి దోమల బెడద ఎక్కువై విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. తాగునీటి పథకాల వద్ద క్లోరినేషన్ పనులు చేయించాలన్నారు. గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ గంగారం, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

బేల: ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెందుర్ రాందాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఐటీడీఏ పీవో వెంటనే వచ్చి సమస్యలు పరిష్కరించాలన్నారు. నీటి వసతి లేక నాలుగైదు రోజులకోసారి విద్యార్థులు స్నానం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల తుడుందెబ్బ అధ్యక్షుడు సిడాం నందకుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఆడ శంకర్, సిడాం కుషాల్‌రావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, నాయకులు

హామీలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం

జైనథ్: గత ఎన్నికల్లో ఇచ్చిన రుణ మాఫీ, డబుల్‌బెడ్ రూం, నిరుద్యోగ భృతి హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని నిరాల గ్రామంలో యువకులు, గ్రామస్తులు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, చంద్రకాంత్ చౌదరి, భోయర్ విజయ్, మయూర్ చంద్ర, రమేశ్, ప్రవీణ్, కరుణాకర్ రెడ్డి, ముకుంద్, వినోద్ పాల్గొన్నారు.


కండువా కప్పుతున్న పాయల్ శంకర్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తలమడుగు: గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో సవారీ బంగ్లాషెడ్డును ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలను నమ్మవద్దన్నారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో బోథ్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ వెంకటేశ్, సహకార సంఘ చైర్మన్, శ్రీనివాస్‌రెడ్డి, వనమాల, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాపురావు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

కైలాస్‌నగర్: మొహర్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని నిరటివాడలో, చించర్‌వాడలో నిర్మించిన సవారీబంగ్లా షెడ్డును ఆదివారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో సవారీ బంగ్లా షెడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా కలిసి మొహర్రం వేడుకలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. అంతకుముందు ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొండ గణేశ్, కస్తాల ప్రేమల, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

ఎవెన్యూ ప్లాంటేషన్ పనుల పరిశీలన

కైలాస్‌నగర్: పట్టణ సుందరీకరణలో భాగంగా చేపడుతున్న ఎవెన్యూ ప్లాంటేషన్ పనులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆదివారం పరిశీలించారు. వినాయక్ చౌక్ నుంచి ఎన్టీఆర్ చౌక్ వరకు కొత్తగా నిర్మించిన డివైడర్ మధ్యలో ఏర్పాటు చేస్తున్న మొక్కలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో రోడ్డు విస్తరణ పనులు చేపటి, సుందరీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. కళ్ల ముందు ఇంత అభివృద్ధి కనిపిస్తుంటే ప్రతిపక్షాలు రాజకీయంగా విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో డీఈ యూనీస్, కొండ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు తక్షణ సాయం అందించాలి

జైనథ్: వరద బాధితులకు ప్రభుత్వం వెంటనే సాయం అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె మండలంలోని ఖాప్రి గ్రామంలో పర్యటించారు. వరద నీరు ఇళ్లలోకి రావడంతో నిత్యావసర సరుకులు తడిసి పోయాయన్నారు. అనంతరం పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో మునిగిన పంటలను పరిశీలించారు. ఎకరానికి రూ. 25వేల చొప్పున నష్ట పరిహారం అందించాలన్నారు. వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఆశీష్‌రెడ్డి, సతీశ్, పవన్, రోహిదాస్ పాల్గొన్నారు.


ఖాప్రి గ్రామంలో పర్యటిస్తున్న సుహాసిని రెడ్డి

నిత్యావసర సరుకులు పంపిణీ

జైనథ్: మండల కేంద్రంలోని ముంపుకు గురైన పలు కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో పర్యటించారు. మండలంలో సర్వే చేసి పంట నష్టం అంచనా వేసి రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాల ధాటికి దెబ్బతిన్న రోడ్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. కార్యక్రమంలో జైనథ్ ఎంపీటీసీ సుదర్శన్, మాజీ ఎంపీటీసీ రాజన్న, బద్దం సురేశ్‌రెడ్డి, మనోజ్, గిమ్మ సంతోశ్, షకీల్, సంతోశ్‌రెడ్డి, కిష్టారెడ్డి, పుంద్రు రవికిరణ్‌రెడ్డి, బండి కిష్టన్న, తదితరులు పాల్గొన్నారు.


సరుకులు అందజేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

సమాచారం

రేపు సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని 18 మండలాల నాయిబ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజయ్ కుమార్, మందపెల్లి శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నాయిబ్రాహ్మణ వృత్తిలోకి ఇతర కులస్తులు రాకుండా జీవో తీసుకురావాలన్నారు. అలాగే ప్రభుత్వం అందజేస్తున్న రూ. లక్ష రుణంపై సైతం చర్చించడం జరుగుతుందన్నారు.

నేడు ఐటీడీఏ ఎదుట ధర్నా

ఆదిలాబాద్‌రూరల్: పోడు భూముల రీ సర్వే చేసి పోడు రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. తుడుందెబ్బ అనుబంధ సంఘాలైన ఏఎంఎస్, ఏఎస్‌యూ, ఏఎన్ఎస్, ఏకేఎస్ సంఘాలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్తం..

పరామర్శ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ఆదివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తిరుమల్ గౌడ్, పాండురంగ్, స్వామి, దేవేందర్ రెడ్డి, గంగారెడ్డి, సుధీర్‌రెడ్డి, సంతోశ్ ఉన్నారు.

బేల: మండలంలోని తోయగూడ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు పెరిక రాజేశ్వర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా.. ఆదివారం కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాలెపు గణేశ్, బరుకుంట సుభాష్, కొత్తపల్లి రాజేశ్వర్, రొడ్డ రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ సంగెం సుధీర్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల ఆకలి తీర్చేందుకు గత 122 వారాలుగా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి కడదారి రాజలింగు, సభ్యులు మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజశేఖర్, రాజయ్య పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలోని ఇళ్లలో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా ఆదివారం వరద బాధితులకు సర్పంచ్ వైభవ్, గ్రామస్తుడు కుర్సంగే లక్ష్మణ్ భోజన సౌకర్యం కల్పించారు.

సీఆర్ఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడిగా శేఖర్

ఆదిలాబాద్‌టౌన్: మాజీమంత్రి సి.రాంచంద్రా రెడ్డి అభిమాన సంఘం అధ్యక్షుడిగా దుర్గం శేఖర్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. సీఆర్ఆర్ అభిమాన సంఘాన్ని ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఎస్సైకి సన్మానం

తాంసి: భీంపూర్ ఎస్సైగా విధులు నిర్వర్తించి, బేల మండలానికి బదిలీపై వెళ్తున్న ఎస్సై రాధికను ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లింబాజీ, సర్పంచ్‌లు నరేందర్, కృష్ణ, రాజన్న, సునీత పాల్గొన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్ అందజేత

తలమడుగు: హస్నీన్ హుస్సేన్ దేవస్థానానికి రూ. 90వేల విలువ గల ఎల్ఈడీ స్క్రీన్‌ను విరాళంగా అందించడం అభినందనీయమని మాజీ విజయ డైయిరీ చైర్మన్ లోక భుమారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో కొండూరు గంగాధర్ ఎల్ఈడీ స్క్రీన్, ఎల్బాల శంకర్ ఎల్ఈడీ స్క్రీన్, తలకొక్కుల నర్సింలు స్పైక్ బెలూన్ అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గోక వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోతి శ్రీనివాస్, సర్పంచ్ పుంద్రు పోతారెడ్డి, ఎల్బాల రామకిస్టు, చారి, గాజుల భీమన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రేమ్‌సాగర్‌రావుకు జెడ్పీటీసీ అభినందనలు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ చారులత రాథోడ్

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ రాష్ట ఎలక్షన్ కమిటీ మెంబర్‌గా నియమితులైన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు తెలంగాణ రాష్ట ఎలక్షన్ కాంపెయిన్ కమిటీ మెంబర్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అభినందనలు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రేంసాగర్‌రావు కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాకు అండగా ఉన్నారని అన్నారు. నాయకులు బాపురావు, సునీల్ జాదవ్, కొమ్ము విజయ్, లింగంపల్లి చంద్రయ్య, మల్లారెడ్డి, ఎక్బాల్, జావిద్, కలీం, పరమేశ్వర్, అఖిల్, మసూద్ పాల్గొన్నారు.

పాఠశాల ఏర్పాటు చేయండి

బోథ్: మండల కేంద్రంలో ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేయాలని బోథ్ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ సోయం బాపురావుకు వినతిపత్రం అందజేశారు. దేశ వ్యాప్తంగా ఏకలవ్య పాఠశాలలను కేంద్రం మంజూరు చేస్తోందని, బోథ్ మండల కేంద్రానికి మంజూరు అయ్యేటట్లు చూడాలని కోరారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఆదిలాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారీబంగ్లా షెడ్డు, మాల సంక్షేమ సంఘ భవనాన్ని ప్రారంభించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా రాష్ట ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఎంపీపీ గంద్రత్ రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ మెస్రం పరమేశ్వర్, సెవ్వ జగదీష్, కుమ్ర రాజు, రామన్న, గంగాధర్, అల్లూరి రమేశ్‌రెడ్డి, నిలేష్ రెడ్డి, రవి, నరేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బోథ్: మండలంలోని గుర్రాలతండా గ్రామానికి చెందిన మల్హారి సింగ్ గత కొంత కొద్దిరోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబ పోషణ మొత్తం చిన్న కూతురు గంగోత్రిపై పడింది. ‘ఇంటికి పెద్ద దిక్కు.. ఆ చిన్నారి’ శీర్షికన సాక్షిలో గత నెల 3న సాక్షిలో కథనం ప్రచురితమైంది. కాగా తెలంగాణ లభాన ఉద్యోగులు సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. రూ.27,840లను మల్హారి సింగ్‌కు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో చౌహాన్ నానక్ సింగ్, ఈశ్వర్ సింగ్, సోలంకి ప్రకాశ్, సంజయ్ సింగ్, శ్రీనివాస్, భీంసింగ్ పాల్గొన్నారు.

కూలిన షెడ్డు

తలమడుగు: మండలంలోని దేవపూర్ గ్రామానికి చెందిన దాతజీ రాములు కమ్మరి కొలిమి షెడ్డు ఆదివారం కూలిపోయింది. కులవృత్తి చేసుకుంటూ.. జీవనం సాగిస్తున్న క్రమంలో షెడ్డు కూలడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వ స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నారు. సర్పంచ్ అబ్దుల్లా, పంచాయతీ కార్యదర్శి కూలిన షెడ్డును పరిశీలించారు.

చిలుకల భీమన్న పండగ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో చిలుకల భీమన్న పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా భీమన్న దేవుని ఆలయానిక చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే వంటావార్పు చేసి సహాపంక్తి భోజనాలు చేశారు. పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండడంతో పాటు గ్రామస్తులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బజార్‌హత్నూర్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి గోడం నగేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని న్యూ అనంతపూర్, హర్కయి, భీంలానాయక్‌తండా, అనంతపూర్, టెంబి, మంజీరాం తండా, ధర్మపురి, దేగామా గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, తాంసి జెడ్పీటీసీ రాజు, ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, చిల్కూరి భూమన్న, మునేశ్వర్ నారాయణ, కొత్త శంకర్, సయ్యద్ జహీర్, ఆడే శీలా, ఆల్కే గణేశ్ పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

ఇచ్చోడ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ముఖరా(కె)లో రెండువేల మొక్కలు నాటారు. సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల నుంచి కేటీఆర్ జన్మదిన సందర్భంగా మొక్కలు నాటుతున్నామన్నారు.